# విధుల్లో ఉన్నా.. దాడులకు తెగబడుతున్నారు..!

- ట్రాఫిక్ పోలీసులపై పెరుగుతున్న దాడులు
- సవాల్‌గా మారుతున్న విధులు

**జూబ్లీహిల్స్, జూన్ 14, ప్రభాతవార్త**

మద్యం మత్తులో కొందరు.. అహంకారంతో మరి కొందరు.. అధికారంతో ఇంకొందరు.. ట్రాఫిక్ పోలీసులపై దాడులకు తెగబడటం ఆందోళన కలిగిస్తుంది.. ఇటీవలి కాలంలో ఈ తరహా సంఘటనలు పెరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులకు విధులు సవాల్‌గా మారుతున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌చేసే అధికారులపై చేయిచేసుకోవడం, వాహనాలతో ఢీకొట్టి వెళ్లడం వంటి సంఘటనలు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఏడాది కాలంలో అయిదారు సంఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.. ఇక్కడే నగరంలోని చాలా మేర ఠాణాల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు కొందరు హోంగార్డులు, కానిస్టేబుళ్లు తనిఖీలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది.. తాజాగా బంజారాహిల్స్‌లో జీహెచ్ఎంసీలో విధులు నిర్వర్తించే ప్రభుత్వ అధికారులే ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడటం చర్చానీయంశమైంది.

**ట్రాఫిక్ నిబంధనల అమలుకు..**

రెండేళ్లుగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ ఉల్లంఘనలు, అధిక వేగం వంటి నేరాలపై నిరంతర చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఈ చర్యలను కొందరు వాహనదారులు వ్యతిరేకిస్తూ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కొందరు వాహనదారులు కావాలని ట్రాఫిక్ పోలీసులను లక్ష్యంగా చేసుకొని తమ మాటలతో, చేష్టలతో, దుర్భాషలాడుతూ దాడులకు తెగబడుతున్నారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలపై వేర్వేరు సంఘటనల్లో వాహనదారులు దాడులుచేయగా వారు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి.

**దాడులు ఇలా..**

– పంజాగుట్ట జంక్షన్‌వద్ద సిగ్నల్ జంప్‌చేసిన ఓ వ్యాపారవేత్తను ట్రాఫిక్ సిబ్బంది ఆపగా అతడు ఆగ్రహానికి గురై విధుల్లో ఉన్న హోంగార్డుపై దాడి చేశాడు. యూనిఫాం చింపివేయడమే కాకుండా అడ్డుకొనేందుకు వచ్చిన మరో హోంగార్డుపై చేయి చేసుకున్నాడు. ఈ ఘటనలో ఓ హోంగార్డుకు ముక్కు భాగంలో గాయాలు కాగా, పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

– గత నెలలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో మద్యం మత్తులో ఉన్న ఓ ఆటో డ్రైవర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ భోళాశంకర్‌ను ఢీకొట్టి పరారయ్యాడు. దీంతో భోళా శంకర్‌కు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. అనంతరం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

– అబిడ్స్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌సిబ్బందితో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాగ్వాదానికి దిగాడు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కల్పించినందుకు అతడిపై కేసు నమోదు చేశారు.

– తాజాగా బంజారాహిల్స్ రోడ్‌నంబరు 2లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీశైలంపై జీహెచ్ఎంసీ ఉద్యోగులు వాహనంలో రాంగ్‌రూట్‌లో రావడమే కాకుండా అడ్డుకున్నందుకు శ్రీశైలంపై దాడికి పాల్పడటంతో కేసు నమోదైంది.

**విధుల్లో సిబ్బందికి సవాల్**

నగరంలో పెరుగుతున్న ఈ తరహా సంఘటనలు ట్రాఫిక్ పోలీసుల విధులకు సవాల్‌గా మారుతున్నాయి. కొన్ని ఘటనల్లో నిందితులు వాహనాలను ఆయుధాల్లా ఉపయోగించి ట్రాఫిక్ సిబ్బందిపైకి దూసుకెళ్లడం మరింత ఆందోళన కలిగిస్తోంది. హైటెక్ సిటీ పరిధిలో జరిగిన ఓ ఘటనలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను కారు ఢీకొట్టడంతో ఆయన గాయపడ్డారు. ఈ తరహా సంఘటనల్లో నిబంధనల ఉల్లంఘించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని కొందరు ట్రాఫిక్ అధికారులు వాపోతున్నారు. ప్రతి వారాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. మద్యం తాగిన వారితోపాటు కలిసి వచ్చేవారు ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. దీంతో ఎండలు, వర్షాలు, కాలుష్యం మధ్య గంటల తరబడి రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది భద్రతపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు అమలు చేసే క్రమంలో దాడులకు గురవుతున్న సిబ్బందికి మరింత రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతున్నాయి. బాడీ కెమెరాలు, అధునాతన నిఘా వ్యవస్థలు, వెంటనేస్పందించే ప్రత్యేక బృందాలు అవసరమని పలువురు అధికారులు సూచిస్తున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు(పాతచిత్రం)



# హైదరాబాద్ వార్త

# బడికి వేళాయే...

- ముగిసిన వేసవి సెలవులు
- నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పునఃప్రారంభం
- పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థుల్లో ఉత్సాహం
- స్టేషనరీ దుకాణాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు సందడి

**హైదరాబాద్, జూన్ 14, ప్రభాతవార్త:** వేసవి సెలవులు ముగియడంతో నేటినుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆయా విద్యాసంస్థల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తిచేస్తుండగా... ప్రభుత్వ పాఠశాలల్లో వారంరోజులుగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే తమ పిల్లలకు తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలు డ్రెస్సులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్టేషనరీ దుకాణాల్లో సందడి నెలకొంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు గోదాములకు చేరుకుంటున్నాయి. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ఇంగ్లీష్ మీడియం మొదటగా 1 నుంచి 8వ తరగతి వరకు అమలు చేశారు. ఆ తర్వాత 9వ తరగతి గతేడాది నుంచి 10వ తరగతి వరకు అమలు చేస్తున్నారు. అయితే చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో కొన్ని స్కూళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు తగిన విధంగా లేవు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందిస్తున్న విషయం తెలిసిందే. పాఠ్యపుస్తకాలను ఆయా స్కూళ్లకు పంపించినా యూనిఫామ్స్ విషయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. యూనిఫామ్‌లు కుట్టే పని ఇంకా పూర్తి కాలేదని తెలుస్తుంది.

**గ్రేటర్‌లోనే విద్యార్థులు ఎక్కువ...**

గ్రేటర్ హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2,550 ప్రభుత్వ, 4667 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రకారం మూడు జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో 19.96 లక్షల మంది, సర్కార్ బడుల్లో 3,49,787 మంది చదువుతున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాతో పోలిస్తే హైదరాబాద్ జిల్లాలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పదోతరగతిలో ఏటా ఉత్తీర్ణతశాతం తగ్గిపోతున్న పరిస్థితి కనిపిస్తుంది. సబ్జెక్ట్ టీచర్ల కొరత పాటు తెలుగు, ఇంగ్లీష్ బోధించే వారు కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

**ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల బాదుడు...**

ఈ ఏడాది ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు భారీగా పెంచారు. గతేడాదితో పోలిస్తే కొన్ని 50 శాతం, మరికొన్ని 25శాతం పెంచాయి. కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి రూ.2లక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. ఒక స్థాయిఉన్న పాఠశాలల్లో ఫీజుల 1.5 లక్షల కంటే ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్కూళ్లలో ఫీజుల బాదుడు ఎక్కువగా ఉంది. పుస్తకాలు, యూనిఫాం పేరిట భారీగా వసూలు చేస్తున్నారు. బ్యాగులు, బెల్టులు, టైలు కూడా తమ వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు.









పోలీసుల అదుపులో నిందితుడు మహ్మద్ నయీం, గంజాయి

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

**26 కిలోలు స్వాధీనం**

**గచ్చిబౌలి, జూన్ 14 ప్రభాతవార్త :** ఐటి కారిడార్ పరిధిలో ఉన్న సప్లయర్లకు గంజాయిని చేరవేసేందుకు ఆటోలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకువస్తున్న ఓ వ్యక్తిని గచ్చిబౌలి, ఎస్ఓటీ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడి వద్ద 26 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని మంగళ్‌హట్‌కు చెందిన మహ్మద్ నయీం(26) గతకొంత కాలంగా గంజాయి సరఫరా చేయసాగాడు. గంజాయి డాన్‌గా పేరున్న నీతుభాయికి నగరంలోని పలు ప్రాంతాల నుంచి నయీం గంజాయిని తెచ్చి ఇస్తున్నాడు. కాగా శనివారం నయీం గంజాయిని తరలిస్తున్నాడని సమాచారం అందుకున్న ఎస్ఓటీ శేరిలింగంపల్లి, గచ్చిబౌలి పోలీసులు నానక్‌రాంగూడ సుమధుర అపార్టుమెంట్ల వద్ద వలపన్ని పట్టుకున్నారు. ఓ ఆటో (టిఎస్11 యుసి1679)లో 26 కిలోల గంజాయిని మూడు బ్యాగుల్లో నింపి తీసుకువస్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. ఈ గంజాయిని స్థానిక గంజాయి డాన్ నీతుభాయితో పాటు మరికొందరికి చేరవేసేందుకు తీసుకువస్తున్నట్లు తెలుస్తుంది. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి గంజాయిని సరఫరా చేసిన ఒడిస్సాకు చెందిన గౌతం నాయక్‌తో పాటు స్థానిక విక్రేతలు కలాపతి నీతుభాయి, కాలాపతి గౌతంసింగ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## నానక్‌రాంగూడలో రోడ్డు ప్రమాదం

**ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

**గచ్చిబౌలి, జూన్ 14 ప్రభాతవార్త :** ఐటి కారిడార్ పరిధిలోని నానక్‌రాంగూడలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం... శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి తండాలో నివాసం ఉంటూ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్న సమీమ్ ఖాన్(52) ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సైకిల్‌పై నానక్‌రాంగూడ రోటరీ సర్కిల్ నుంచి హనుమాన్ దేవాలయం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో నానక్‌రాంగూడలోని స్పిరిట్స్ వైన్‌మార్ట్‌లో ఉండే అరుణ్(22) ద్విచక్రవాహనం(టిఎస్07 ఎఫ్‌వి5546) వెనుక నుంచి అతివేగంగా,నిర్లక్ష్యంతో దూసుకువచ్చాడు. నానక్‌రాంగూడ హనుమాన్ దేవాలయం సమీపంలో సైకిల్ మీద వెళ్తున్న సమీమ్‌ఖాన్‌ను ఢీ కొట్టిన అరుణ్ బైక్ ఆగకుండా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ బైక్ వెనుక కూర్చున్న కామారెడ్డికి చెందిన ఇంద్రసేన్‌రెడ్డి(25) ఒక్కసారిగా బైక్ మీద నుంచి ఎగిరి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనం నడిపిన అరుణ్‌కు, సైకిల్‌ప వెళ్తున్న సమీమ్‌ఖాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ఇంద్రసేన్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సమీమ్‌ఖాన్, అరుణ్‌లను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఇంటర్ ఫెయిల్.. మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

**జూబ్లీహిల్స్, జూన్ 14, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం..వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మచ్చాపూర్‌కు చెందిన దులం నవదీప్(17) బీఎస్ మక్తా ప్రాంతంలో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతను ఎస్ఆర్‌నగర్‌లోని అరోమా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. ఐదేళ్ల క్రితం విద్య, ఉపాధి అవకాశాల కోసం నవదీప్ తల్లి సరిత తన ఇద్దరు కుమారులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో నవదీప్ ఉత్తీర్ణుడు కాకపోవడంతో సప్లిమెంటరీ పరీక్షలు రాశాడు. జూన్ 11న విడుదలైన ఫలితాల్లో అతను ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన నవదీప్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పొరుగువారు మృతుడి సోదరుడు వివేక్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వివేక్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్కాజ్‌గిరి కమిషనర్ సుమతిని మర్యాదపూర్వకంగా కలిసిన ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డా. బి.వి.నాగ మోహన్‌రావు

## మల్కాజ్‌గిరి సిపిని కలిసిన నాగ మోహన్‌రావు

**సికింద్రాబాద్, జూన్ 14 ప్రభాతవార్త:** గాంధీ మెడికల్ కళాశాల, సికింద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డా. బి.వి. నాగ మోహన్ రావు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఫోరెన్సిక్ మెడిసిన్, మెడికో లీగల్ సేవలు, నేర పరిశోధనలో శాస్త్రీయ ఆధారాల ప్రాముఖ్యత, అలాగే పోలీస్ శాఖ మరియు వైద్య సంస్థల మధ్య సమన్వయంపై చర్చించారు.

## టిప్పర్ ఢీకొని ఇద్దరి మృతి

**సరూర్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** టిప్పర్ లారీ ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాలమండలం ఎల్లమ్మ తండాకు చెందిన సబావత్ సునీల్ (35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ గుర్రంగూడలోని ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఆటో చెడిపోవడంతో రోడ్డు పక్కన నిలిపాడు. ఆటోను టోయింగ్ చేసేందుకు మాడ్గుల మండలం రాందుగ్యాల గ్రామానికి చెందిన సబావత్ ప్రసాద్(26)ను అక్కడికి పిలిపించుకున్నాడు. అయితే అదే సమయంలో ప్రసాద్‌ను కలిసేందుకు నందనవనం కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సంతోష్(35) అక్కడకు వచ్చాడు. సునీల్ ఆటో సమీపంలో నిలబడి ఉండగా, ప్రసాద్ రోడ్డును దాటాడు. సునీల్, సంతోష్‌లు ఇద్దరు రోడ్డు దాటేందుకు రోడ్డు పక్కనే నిలబడి ఉన్నారు. ఇదే సమయంలో ఎల్‌బినగర్ నుండి మందమల్లమ్మ చౌరస్తా వైపు వెళ్తున్న టిప్పర్ లారీ వేగంగా వచ్చి రోడ్డు పక్కన నిలబడి ఉన్న సునీల్, సంతోష్‌లను ఢీకొట్టింది. ఈ సంఘటనలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలకు గురైన సునీల్‌ను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ జావల సురేష్‌గా గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రారంభానికి సిద్ధమైన కొమురవెల్లి రైల్వేస్టేషన్

**మురవెల్లి మల్లన్న భక్తులకు శుభవార్త**

**తార్నాక, జున్ 14 ప్రభాతవార్త :**

కొమురవెల్లి మల్లన్న పుణ్య క్షేత్రానికి ఇకపై రైళ్లలో వెళ్లవచ్చు. కొత్తగా నిర్మిస్తున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనులు పూర్తయ్యాయి. ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. మొదట కొమురవెల్లి రైల్వే స్టేషన్‌గా నామకరణం చేయగా తరువాత కొమురవెల్లి పుణ్యక్షేత్రంగా మార్చారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ రైల్వే స్టేషన్ ప్రారంభమైతే హైదరాబాద్ నుంచి, ఇతర ప్రాంతాల నుంచి భక్తుల ప్రయాణానికి మరింత సౌకర్యంగా ఉంటుంది. దీంతో పాటు కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ మెరుగుపడనుంది. సిద్దిపేట జిల్లాలో కొత్తగా నిర్మించిన కొమరవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రసిద్ధ కొమరవెల్లి మల్లన్న స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు కనెక్టివిటీని పెంచేందుకు ఈ రైల్వే స్టేషన్ను నిర్మించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.5.63 కోట్లు కాగా, ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయన్నారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి త్వరలో స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించనున్నట్లు మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవెల్లి మల్లన్న ఆలయం తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే భక్తుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.





## నేడు లోక్‌భవన్ స్కూల్‌లో అల్పాహారం

**ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 14:** రాష్ట్ర వ్యాప్తంగా వేసవి సెలవుల అనంతరం నేటి(సోమవారం) నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం ప్రారంభించనున్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు లోక్‌భవన్ పాఠశాలలో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మన్నా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అమలు చేయనున్న ఈ పథకం మొదటి దశలో 45 పాఠశాలలలో 12,437 విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో డ్రాపౌట్ శాతం తగ్గించే దిశగా మధ్యాహ్న భోజనంతోపాటు అల్పాహార పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇందులో భాగంగా ఉదయం విద్యార్థులకు అందించే అల్పాహారం మెనూలోని మిల్లెట్ ఇడ్లీ సాంబార్, మిక్స్ వెజ్ కుర్మాతో పూరీ, చట్నీతో బోండా, ఉప్మా చట్నీ అలాగే దోస అందించడం జరుగుతుందని మంత్రి కార్యాలయం తెలిపింది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 672 ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అలాగే నోట్ పుస్తకాలు అందించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## జలాశయాల్లోని నీటి మట్టాలు నిరంతరం పర్యవేక్షించాలి

**వరద సన్నద్ధతపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 14 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో కొనసాగుతున్న వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఆదివారం హిమాయత్ సాగర్ జలాశయాన్ని సందర్శించి వరద సన్నద్ధత చర్యలు, కార్యాచరణ ప్రణాళికలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా జలాశయ భద్రతా ప్రమాణాలు, ఆపరేషనల్ రెడీనెస్, వివిధ శాఖల మధ్య సమన్వయ వ్యవస్థలు, వరద నిర్వహణకు సంబంధించిన ప్రోటోకాల్స్‌పై అధికారులు చేపడుతున్న చర్యలను ఎండీ సమగ్రంగా పరిశీలించారు. వర్షాకాల ప్రవాహాలు ప్రారంభమైన నేపథ్యంలో జలాశయాల్లోని నీటి మట్టాలు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహాలు, నీటి నాణ్యతకు సంబంధించిన టర్బిడిటీ స్థాయిలను 24 గంటలపాటు నిరంతరం పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 14వ తేదీ ఉదయం 6 గంటల నాటికి హిమాయత్ సాగర్ జలాశయంలోకి 800 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది.

అలాగే ఉస్మాన్‌సాగర్ జలాశయానికి కూడా ప్రవాహాలు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. జలాశయాల నిర్మాణ భద్రతను అత్యున్నత స్థాయిలో కాపాడడంతో పాటు, దిగువ ప్రాంతాల్లో వరద నిర్వహణ సమర్థవంతంగా జరిగేలా రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఎండీ ఆదేశించారు. అవసరమైతే చేపట్టే నీటి విడుదలలు, నీటి మట్టాల మార్పులపై సంబంధిత శాఖలకు ముందస్తుగా సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే.. జంట జలాశయాల పరిస్థితిని జలమండలి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రవాహాల పరి స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.



హిమాయత్‌సాగర్ సందర్శించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

# నగరంలో పోలీస్ మెంటార్ వ్యవస్థ

**ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక మెంటార్**

**సీపీ వీసీ సజ్జనర్**

**హైదరాబాద్, జూన్ 14 ప్రభాతవార్త :** నగరంలో భద్రతను బలోపేతం చేసేందుకు సిటీ పోలీస్ సరికొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. 'మార్గదర్శక్' కార్యక్రమానికి అనుబంధంగా, కొత్తగా 'పోలీస్ మెంటార్స్ ప్రోగ్రామ్'ను తీసుకువస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రకటించారు. ఇకపై ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను మెంటార్‌గా నియమిస్తామని, వారు క్షేత్రస్థాయిలో మార్గదర్శక్ వలంటీర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారని తెలిపారు. టీజీఐసీసీసీలో జరిగిన మార్గదర్శక్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీపీ సజ్జనర్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం, మార్గదర్శక్ లోగోను ఆవిష్కరించి, రెండో దశ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా భద్రత, మహిళా భద్రత, అత్యవసర సేవలలో భాగస్వాములుగా ఉంటూ, ప్రజలను చైతన్యవంతమైన వలంటీర్లుగా తీర్చిదిద్దడమే మార్గదర్శక్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. బాధితులకు తక్షణ అండగా నిలుస్తూ, పోలీసు వ్యవస్థకు 'ఫోర్స్ మల్టిప్లయర్స్'గా పనిచేసేలా పౌరులను సిద్ధం చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వలంటీర్లకు ప్రజా భద్రత, ఎమర్జెన్సీ రెస్పాన్స్, మహిళల భద్రత, సైబర్ అవగాహన వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించామని, వీరంతా ఇకపై సేఫ్టీ అంబాసిడర్స్‌గా నగర భద్రతలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ పోలీసులకు, బాధితులకు మధ్య మార్గదర్శకులు ఒక నమ్మకమైన వారధిగా పనిచేయాలని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలు తమ ఇబ్బందులను మహిళా సిబ్బంది వద్ద మరింత స్వేచ్ఛగా, నిర్భయంగా చెప్పుకోగలరన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని, బాధితులకు తక్షణ సాయం, భరోసా అందించేందుకు 'స్పందన ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్' అనే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ వ్యవస్థ, మార్గదర్శక్, పోలీస్ మెంటార్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేస్తూ మహిళా భద్రతకు ఒక బలమైన రక్షణ కవచంలా మారుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రిటైర్డ్ అధికారులు, విద్యావేత్తలు,నిపుణుల సేవలను ఈ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. మార్గదర్శకులు మొదటి స్థాయిలో సహాయం అందిస్తే, ఆయా స్టేషన్లలోని పోలీస్ మెంటార్లు వారికి నిరంతర తోడ్పాటును అందిస్తారని, తద్వారా కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీలు ఆఫీసుల్లో ఈ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీసీపీ డాక్టర్ లావణ్య, హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ సి.శేఖర్‌రెడ్డి, మహిళా ఫోరం జాయింట్ సెక్రటరీ ఖ్యాతి నారవనే తదితరులు పాల్గొన్నారు.



మార్గదర్శక్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో వలంటీర్లకు సర్టిఫికెట్లను అందించిన సీపీ సజ్జనర్

## ఇద్దరు చిన్నారులకు ఉరివేసి..
# తల్లి బలవన్మరణం

✦బిడ్డలను అనాథలుగా వదిలేయలేక...నాతో తీసుకెళుతున్నా
✦ సూసైడ్ నోట్ .... అడవి వెంకటాపూర్‌లో విషాదం
✦భర్త వేధింపులే కారణమని మృతురాలి బంధువుల ఫిర్యాదు

**పరిగి జూన్ 14 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలు నిండు సంసారంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. భర్త, కుటుంబ సభ్యుల వేధింపులతో మనస్తాపానికి గురైన ఓ తల్లి, తన ఇద్దరు అమాయక పిల్లలను ఉరివేసి చంపి, ఆపై తానూ ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ ఘోర ఘటన చౌడాపూర్ మండల పరిధిలోని అడవి వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల



కథనం ప్రకారం... అడవి వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంబుల మల్లేష్ భార్య జంబుల నవనీతకు ఒక కుమారుడు విగ్నేష్, కూతురు మధుప్రియ ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్త మల్లేష్, కుటుంబ సభ్యులు నవనీతను తీవ్రంగా వేధిస్తుండేవారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి కుటుంబంలో మళ్లీ కలహాలు రేగడంతో తీవ్ర మనస్థాపానికి లోనైన నవనీత ఘోర నిర్ణయం తీసుకుంది. తాను చనిపోతే తన పిల్లలు అనాథలు అవుతారని భావించిన ఆమె, పిల్లలు అనాథలు కాకూడదనే నాతో పాటు తీసుకెళ్తున్నా.. అని సూసైడ్ నోట్ రాసి పెట్టింది. అనంతరం తన చేతులతోనే కుమారుడు విగ్నేష్, కూతురు మధుప్రియలను ఉరివేసి హతమార్చింది. ఆ తర్వాత తానూ అదే గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి పుట్టింటి వారి ఫిర్యాదు మేరకు భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సిఐ కొండల్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నిందితుడైన భర్త మల్లేష్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఒకే ఇంట్లో తల్లి, ఇద్దరు చిన్నారులు శవాలుగా మారడంతో అడవి వెంకటాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం:ఎమ్మెల్యే

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** కాలనీలలో ప్రజలకు కావలసిన అవసరమైన మూలిక వసతులు కల్పించడం మేత మధ్య ఏమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ శ్రీనివాస కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాలనీలోని రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, మహేష్‌రెడ్డి, గాలయ్య, దీప్‌లాల్, జహీర్‌ఖాన్, మహమ్మద్ యాసిన్, బట్టు అంజయ్య, జోగు నాగేష్, కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్‌చారి, భీంరాజ్, సుబ్బయ్య, సంపత్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడలో ఉమెన్స్ సైక్లింగ్ పోటీలు



**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** మహిళలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని టీపీసీసీ ప్రధాన కార్య దర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్ సైక్లింగ్ సిటీ లీగ్ 2026 (హైదరాబాద్‌ఎడిషన్) కార్యక్రమానికి శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారత, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందింపుకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 105 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, క్రీడ ల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని అన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవడానికి సైక్లింగ్ వంటి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల మరింత ఆసక్తిని కలిగిస్తాయని తెలిపారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం, క్రీడా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ప్రాంతీయ డైరెక్టర్ నల్లి జ్యోతికుమార్, ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియా, యాదయ్య, డాక్టర్ మాక్స్‌వెల్ ట్రెవర్, లోరైన్ ట్రెవర్ తదితరులు పాల్గొన్నారు.




# అడుగంటిన కోటా!

### ఎరువుల దుకాణాలలో నో స్టాక్ బోర్డులు
### దొడ్డిదారిన బ్లాక్‌మార్కెట్
### రూ.1,350 ఉన్న డిఎపి 1,500 వరకు వసూళ్లు
### రూ.266 ధర పలికే యూరియా 350కు విక్రయం

**ధారూర్, జూన్ 14 ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో తొలకరి పలకరింపుతో రైతులు ఎంతో ఆశతో చేలను సిద్ధం చేసుకుని సాగు పనులను ప్రారంభించారు. కానీ, విత్తనం నాటేందుకు అవసరమైన బలాన్ని చ్చే ఎరువులు అధికారులు సైతం ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో మండల రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. సమస్యలు చెప్పుకుందామని స్థానిక మండల వ్యవసాయ అధికారికి ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా ఎత్తడం

★వందల మెట్రిక్ టన్నుల యూరియా కొరత! ★ఉదాసీనత వీడని అధికారులు ★కలెక్టర్ మాటకూ దక్కని గౌరవం! ★నిస్సహాయంగా ధారూర్ రైతులు ★మండలంలో 21వేల ఎకరాలలో సాగుకు సమాయత్తం ★గత సీజన్లో 479 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం ★పెరిగిన సాగు విస్తీర్ణంతో ఈ ఏడాది 20 నుంచి 30 శాతం అదనంగా అవసరం

మాత్రం మార్కెట్‌లో మచ్చుకైనా దొరకడం లేదు. డీఏపీ, యూరియా, 2020 వంటి కీలకమైన ఎరువులు ఏ దుకాణంలోనూ లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మండలంలో ఎన్నో విత్తన, ఎరువుల దుకాణాలు ఉన్నప్పటికీ ఎక్కడా ఒక్క బస్తా ఎరువు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**గంటల తరబడి నిరీక్షణ**

ఎక్కడైనా కొద్దిగా స్టాక్ ఉందనే సమాచారంతో వెళ్తే, అక్కడ రైతులు గంటల తరబడి బారులు తీరాల్సి వస్తోంది. రైతుల ఇబ్బందులను గమనించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ స్వయంగా ఈ నెల 19వ తేదీన మండలంలోని భీమన గ్రోమోలి దుకాణాన్ని సందర్శించారు. మరుసటి రోజు కల్లా రైతులకు డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని దుకాణ నిర్వాహకులను గట్టిగా ఆదేశించడమే కాకుండా, జిల్లా, మండల వ్యవసాయ అధికారులు దగ్గరుండి రైతులకు ఎరువులు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి రోజులు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం మాత్రం శూన్యంగా మారింది. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ మాటలనే దుకాణదారులు, అధికారులు ఖాతరు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లేదని రైతులు మండిపడుతున్నారు.

**తెరవెనుక బ్లాక్ దందా**

ఎరువులు లేవని బోర్డులు తిప్పేస్తున్న కొందరు దుకాణదారులు, తెరవెనుక మాత్రం నల్లబజారుకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్న ఎరువులను విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయిస్తూ, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వారికి ఒక్క సంచి కూడా ఇవ్వబోమని తెగేసి చెబుతుండటంతో రైతులు నోరుమెదపలేకపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించాల్సిన ధరలకు, ప్రస్తుత బ్లాక్ మార్కెట్ ధరలకు భారీ తేడా కనిపిస్తోంది. డీఏపీ అసలు ధర రూ.1,350 ఉండగా, దుకాణదారులు రూ.1,500 వరకు గుంజుతున్నారు. యూరియా అసలు ధర రూ.266 ఉండగా, దాన్ని ఏకంగా రూ.350కు విక్రయిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

**ఆన్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తం**

పోనీ, యూరియాను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుందామంటే వ్యవసాయ అధికారులు దాన్ని ఆన్‌లైన్ సిస్టమ్‌లో సిస్టమ్లో పెట్టడం లేదని తెలుస్తోంది. అధికారుల ఉదాసీనత దుకాణదారులకు వరంగా మారి, యూరియా సంచులను యథేచ్ఛగా పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



**ఇక్కడ దొరకక ఎక్కడి నుంచో కొనుగోళ్లు**

మండలంలో ఎరువులు దొరకకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రైతులు వికారాబాద్, తాండూర్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ఎరువులు తెచ్చుకుందామంటే ఒక్కొక్క బస్తా రవాణా ఖర్చులకే ..80 నుండి ..100 వరకు అదనపు భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, తాము ఇండెంట్ పెట్టినప్పటికీ ఇప్పటివరకు పైనుంచి ఎరువుల సరఫరా రాలేదని కొందరు దుకాణ నిర్వాహకులు చెబుతున్నారు.

**పిఎసిఎస్‌లకు అరకొర సరఫరా**

రెండు రోజుల క్రితం ధారూర్, హరిదాసు పల్లి పిఎసిఎస్ కేంద్రాలకు కేవలం 200 సంచుల డీఏపీ రాగా, అక్కడి అవసరాలకు ఆ కొద్దిపాటి కోటా ఏమాత్రం సరిపోలేదు. ధారూర్ మండలంలో ఈసారి సాగు విస్తీర్ణం భారీగా ఉంది. మండల వ్యాప్తంగా దాదాపు పత్తి 6,000 నుండి 7,000 ఎకరాలు, వరి 6,000 ఎకరాలు, కందులు, 5,000 ఎకరాలు మొక్కజొన్న, 3,000 ఎకరాలు పెసలు 800 ఎకరాలు, మినుములు 200 ఎకరాల వరకు సాగవుతున్నాయి. గత సీజన్లో మండలంలో దాదాపు 225 మెట్రిక్ టన్నుల డీఏపీ, 274 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవగా, ఈ సారి సాగు పెరగడంతో దాదాపు 300 మెట్రిక్ టన్నుల డీఏపీ, 295 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేశారు. కానీ, ఇప్పటివరకు మండలానికి కేవలం 25 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే రావడం గమనార్హం. ఈ అరకొర సరఫరా ఏ మూలకూ సరిపోవడం లేదు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ అధికారుల్లో చలనం రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ధారూర్ మండలానికి పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా తగినంత ఎరువుల కోటాను విడుదల చేయించాలని, నల్లబజారు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని మండల రైతులు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# కొనుగోళ్లలో కిరికిరి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

◆ఫోర్జరీ సంతకాలతో బిల్లులు తారుమారు ◆జగ్గంగూడ ధాన్యం కేంద్రం సిబ్బంది నిర్వాకం ◆తరుగు పేరుతో లారీకి ఏకంగా 66 బస్తాలు కోత ◆బినామీ రైతుల పేరుతో స్వాహా ◆అక్రమాలపై ఇన్‌ఛార్జిని నిగ్గదీసిన రైతులు ◆శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు ◆కలెక్టర్ దృష్టికి తీసుకెళతా: ఏఎంసి చైర్మన్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జూన్ 14, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పరిధిలోని మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పెద్ద ఎత్తున అవతవకలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఇన్‌ఛార్జి రాము తమకు తెలియ కుండానే బిల్లులు మారుస్తున్నారని, ఫోర్జరీ సంతకాలు చేసి కోతలు విధిస్తున్నారని బాధిత రైతులు (మైర విష్ణువర్ధన్రెడ్డి, మజ్జిగ సత్తయ్య, బలమైన వీరేశ్, దుద్దెల సురేశ్, నాగుల ప్రహ్లాద్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు) ఆరోపించారు. క్వింటాలుకు సుమారు రూ. 2,300 చెల్లించాల్సి ఉండగా, ధాన్యం తీసుకున్న సమయంలో రైతులకు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని వారు వాపోయారు. ఒక లారీ లోడ్‌లో 810 బస్తాల ధాన్యాన్ని మిల్లుకు తరలించినప్పుడు, తరుగు పేరిట 33 బస్తాలు తగ్గించాల్సింది పోయి ఏకంగా 66 బస్తాలు తగ్గించి బిల్లులు చేశారని రైతులు విమర్శించారు. ప్రతి లారీ లోడ్ పంపే సమయంలో అటు మిల్లు వారు, ఇటు కేంద్రం నిర్వాహకులు బస్తాలు తగ్గించి, మిగిలిన ధాన్యాన్ని బినామీ రైతుల పేరిట కాజేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇన్‌ఛార్జి రామును నిలదీయగా, అలియాబాద్ సెంటర్ విజయ్ సూచనల మేరకే తాను ఇలా తగ్గిస్తున్నట్లు సమా ధానమిచ్చారని రైతులు తెలిపారు.

**ప్రభుత్వానికి చెడ్డపేరు తేకండి: ఏఎంసి చైర్మన్**

మరోవైపు కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు రోజుల తరబడి వాహనాల్లో ధాన్యం పెట్టుకుని వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై బాధిత రైతులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించడమే కాకుండా, జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మేడ్చల్ ఏఎంసి చైర్మన్ బి. నర్సింలు యాదవ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తూ, రైతులకు అన్యాయం చేసే ఏ అధికారిని లేదా నిర్వాహకుడినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## 17,18న లిఫియా జాతీయ సమావేశం

**ఎల్.బి.నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** భారత జీవిత బీమా ఏజెంట్ల సమైక్య లిపియా 18వ జాతీయ సాధారణ మండలి సమావేశాన్ని ఈనెల 17,18 వ తేదీన నగరంలోని నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు లిఫియా జాతీయ ప్రధానకార్యదర్శి ఎస్.బి.శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి, పబ్లిసిటీ కమిటీ చైర్మన్ షేక్‌షాజహాన్ తెలిపారు. నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో సాధారణ మండలి సమావే శానికి సంబంధించిన పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న 3000 మందికి పైగా సాధారణ మండలి సభ్యులు జాతీయ,రాష్ట్ర ప్రతినిధులు, జీవితబీమా ఏజెంట్లు హాజరవుతారని తెలిపారు. 1964 లియాఫీ నాయకత్వం ఆధ్వ ర్యంలో రెండురోజులు జరగనున్న సమావేశంలో బీమా రంగం, భీమా ఏజెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి చర్చ జరుగుతుంద న్నారు. భీమా రంగంలో ప్రస్తుత పరిణామాలను సమీక్షించి సమస్త గత అంశాలపై చర్చించి ఏజెన్సీ బలాన్ని మరింత బలోపేతం చేయడానికి పాలసీదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వ్యూహాలను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి, హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్ ముఖ్యఅతిథులుగా హాజరై దిశనిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బి.శ్రీరామ్, రాజ్యాంగ కమిటీ చైర్మన్ బిఎన్.చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, హేమలత, జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమ్మెకు ఎన్వీఎస్ఎస్ మద్దతు

**రామంతాపూర్, జూన్ 14 ప్రభాతవార్త :** రామంతాపూర్ బాలకృష్ణ నగర్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న భవన నిర్మాణ కార్మికులు సమ్మె కు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

అనంతరం మాట్లాడుతూ కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధ న కోసం చేపట్టిన సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్‌గుప్తా, బీజేపీ నాయకులు తాళ్ల బాలకృష్ణ గౌడ్, కొంపల్లి ఉపేందర్, మహేశ్వర్‌రెడ్డి, ఇలిటం నర్సింహారెడ్డి, పడిగం నాగేష్, నేరేడు రమేష్, పబ్బాల రామకృష్ణ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# ఆటలకు టాటా



### నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం
### ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు సరఫరా
### నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి యూనిఫారాలు
### మధ్యాహ్న భోజన వసతులకు ఏర్పాట్లు పూర్తి
### ఎమ్మెల్యేల చేతులమీదుగా అల్పాహార పథకం ప్రారంభం
### బడిబాట ఫలితంగా కొత్తగా ఐదు వేల మంది విద్యార్థులు పెరిగే అవకాశం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** యాభై రోజుల వేసవి సెలవుల తర్వాత వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు ఈనెల 15 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈసారి ప్రభుత్వం విద్యార్థులకు ముందస్తుగానే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను సరఫరా చేసింది. నాలుగైదు రోజుల్లో యూనిఫారాలు కూడా రానున్నట్లు సమాచారం. అనివార్య కారణాలు ఏవైనా ఉంటే కొంత జాప్యం జరగొచ్చు. విద్యార్థుల మధ్యాహ్నం భోజన వసతులకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బడి బాట కార్యక్రమం ద్వారా ఈసారి కొత్తగా ఐదు వేల మంది విద్యార్థులు చేరవచ్చని అంచనా. వికారాబాద్ జిల్లాలో మొత్తం 1,066 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో ప్రాథమిక పాఠశాలలు 774, ప్రాథమికోన్నత పాఠశాలలు 116, ఉన్నత పాఠశాలలు 176 ఉన్నాయి. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 65 వేల మంది ర్థులు చదువుకుంటున్నారు.

**హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహార సేవలు**

తాండూరు నియోజకవర్గంలో హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందజేయనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ నెంబర్ వన్ స్కూలులో ఎమ్మెల్యే బి.మనోహర్రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. కొడంగల్ యోజకవర్గంలో గత రెండేళ్లుగా ఈ సంస్థ ఉచితంగా అల్పాహారం అందజేస్తోంది. పరిగి యోజకవర్గంలో అక్షయపాత్ర ద్వారా అల్పాహారం అందజేస్తున్నట్లు డీఈవో ఘనీ తెలిపారు.

**గ్రామాల్లో రేషనలైజేషన్ ఆందోళనలు**

చాలా ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించే రేషనలైజేషన్ ప్రక్రియ జరిగితే, మారుమూల పాఠశాలల్లో పోస్టుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. దీనివల్ల మల్టీ గ్రేడ్ టీచింగ్ పెరిగి, టీచర్లపై అదనపు భారం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆగని ప్రైవేట్ పాఠశాలల దోపిడీ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలల తీరులో ఎలాంటి మార్పు లేదు. పూర్తిస్థాయి వసతులు, నిబంధనలు లేకపోయినా పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఆరంభంలో కఠినంగా వ్యవహరించి, ఆ తర్వాత మెత్తబడటం పరిపాటిగా మారింది. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. చాలీచాలని గదులు, సరైన గాలి, వెలుతురు లేని వాతావరణంలో బోధన సాగడం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలు కొత్త స్కూళ్లకు అనుమతులు లభించాయి. విద్యాశాఖ ద్వారా అనుమతులు ఇప్పించే పేరిట కొందరు బ్రోకర్లు భారీగా డబ్బులు దండుకుంటున్నారు.

# యమపాశాలు

### షాద్‌నగర్‌లో ప్రమాదకరంగా మారిన కేబుల్ వైర్లు
### విద్యుత్ స్తంభాలకు అంటుకుంటున్న మంటలు
### నిబంధనలకు విరుద్ధంగా పదుల వరుసలతో వైర్ల వ్యవస్థ
### గాలివాన సమయాల్లో పొంచి ఉన్న పెనుముప్పు!

**షాద్‌నగర్, జూన్ 14 ప్రభాతవార్త:** షాద్ నగర్ పట్టణ కేంద్రంలో రాత్రి సమయంలో విద్యుత్ స్తంభాలకు మంటలు అంటుకున్నాయి. వాటికి ఏర్పాటుచేసిన నెట్ కేబుల్స్ జంక్షన్ బాక్స్‌లో మొదట మంటలు చెలరేగి, అవి స్తంభానికి పెద్ద ఎత్తున వ్యాపించాయి. వెంటనే సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు మంటను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బందిని సంప్రదించారు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. పట్టణ ఏఈ వినోద్ తదితర సిబ్బంది సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడంతో భారీ ప్రమాదం సంభవించకుండా తప్పింది. ఇదిలా ఉండగా, షాద్ నగర్‌లో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తు న్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ వైర్లు పలు ప్రాంతాలలో తీవ్ర ప్రమా దకరంగా మారుతున్నాయి. సాధారణంగా విద్యుత్ స్తంభాలపై కేవలం నాలు గైదు వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉండాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ స్తంభాలపై పదుల వరుసలతో కూడిన కేబుల్ వైర్లు దాదాపు అన్ని ప్రాంతా లలో వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇవి నిరంతరం ప్రమాదాలకు కారణ మవుతుండటంతో షాద్ నగర్ పట్టణ ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గాలి దుమారానికి విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలినప్పుడు మెరుపులు వచ్చి,



షాద్‌నగర్‌లో కేబుల్ జంక్షన్ బాక్స్ నుంచి మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

అవి కింద ఉన్న కేబుళ్ల మీద పడి మంటలు వస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు నిత్యం ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర భయాం దోళనలకు గురవుతున్నారు. నగరంలో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రైవేటు సంస్థల పరిధిలోనే నడు స్తోంది. కేబుల్ టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు ఎవరికీ వారుగా తమ కంపెనీకి చెందిన పెద్ద ఎత్తున తీగలను విద్యుత్ స్తంభాలకు వేలాడ దీస్తూ ఏర్పాటు చేస్తున్నారు.

**కేబుల్ ఆపరేట్ల ఇష్టారాజ్యం**

ఈ విషయంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధి కారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో ఇష్టారా జ్యంగా కేబుళ్ల ఏర్పాటవుతున్నాయి. షాద్ నగర్ పట్టణంలో ఇవి ఇప్పుడు నిత్య కృత్యం అయ్యాయి. ముఖ్యంగా విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్ల ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ నుంచి ఎలాంటి అనుమతి కూడా తీసుకోవడం లేదు. ఒకవేళ అనుమతి తీసుకున్నప్పటికీ అధికారులు వీటిని పట్టించుకునే అవకాశాలు లేకపోలేదు. అదే విధంగా మున్సిపల్ శాఖ సైతం ఈ విషయాన్ని పూర్తిగా నిరక్ష్యం చేయడంతో కేబుళ్ల విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**శాఖల మధ్య సమన్వయలోపం**

ఈ విషయంలో సమన్వయంతో వ్యవహరించాల్సి న ప్రభుత్వ శాఖలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరి స్తున్నాయన్న ఆరోపణలు గట్టిగా వినిపి స్తున్నాయి. ఈ కేబుళ్ల వల్ల విద్యుత్ సిబ్బందికి మరమ్మతుల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలుతెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. దీనికోసం భారీ క్రేన్లను తెప్పించి కేబుళ్ల తగలకుండా పనులు చేయాల్సి వస్తోందని, అయినా ఆ సమయంలో అవి తమ క్రేన్లకు అడ్డుగా వస్తు న్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు రహదారులపై భారీ వాహనాలు వెళ్లినప్పుడు కిందకు